కథ

శశి. సారధి

# అనుబంధం

**ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. లలితమ్మగారు డ్రాయింగ్‌రూమ్‌లో కూర్చుని ఆ రోజు పేపర్ తీసి పట్టుకున్నారు.**

పట్టుకున్నారు అంతే. చదవడం లేదు. మనసు పరిపరి విధాలు పోతుంది. పాతరోజులు ఈ రోజు మరీమరీ గుర్తుకు వస్తున్నాయి. ఒంటరిగా వుండడం వలన జరిగిపోయిన రోజుల్ని జ్ఞాపకం చేసుకోవడం తప్ప ఏమీ పనిలేదు. మనసు ముప్పై ఐదు సంవత్సరాల ముందుకి వెళ్ళిపోయింది.

కొడుకు రవి పది సంవత్సరాల పిల్లవాడుగా వున్నప్పుడు గుండెపోటు వచ్చి భర్త మరణించాడు. ఆ రోజులు తలచుకుంటే, ఇప్పటికీ గుండె జలదరిస్తుంది. ఎంత భయంగా వుండేది! దగ్గర వాళ్ళు ఎవ్వరూ లేక చిన్నపిల్లవాడితో భవిష్యత్తు అంధకారంగా అనిపించేది. భర్తకు వచ్చిన ప్రావిడెంట్‌ఫండ్ బ్యాంకులో వేసి, ప్రభుత్వం ఇచ్చే ఫ్యామిలీ పెన్షన్‌తో కాలం నెట్టుకు వచ్చేది. ఏ నెలకానెల 'డబ్బు సరిపెట్టగలనా?' అని భయపడుతూ వుండేది. కొన్నాళ్ళు ప్రక్కనే వున్న స్కూలులో నర్సరీ టీచరుగా చేసింది. అలాగే కొడుకుని కళ్ళల్లో పెట్టుకుని పెంచింది. వాడు కూడా ఎప్పుడూ అందలేని కోరికలు కోరలేదు. చాలా బుద్ధిగా చదువుకుని, మంచి కాలేజిలో సీటు సంపాదించి ఇంజనీరు అయ్యాడు. వాడికి ఉద్యోగం వచ్చిన రోజు, ఎంత సంతోషించిందో, మాటలతో వ్యక్తం చెయ్యలేదు. అన్ని సంవత్సరాల తమ ఉమ్మడి కష్టానికి ఫలితం దక్కిందని అనిపించింది.

ఇంకో రెండు మూడు సంవత్సరాలు అలాగే గడిచిపోయాయి. తెలిసిన వాళ్ళందరికీ చెప్పి, రవికి సంబంధాలు చూడడం మొదలుపెట్టింది. వాడికి పెళ్ళి చేసేస్తే, తన బాధ్యత పూర్తిగా తీరినట్లే అనుకునేది. ఒకరోజు సాయంత్రం కొడుకుతో బాటు ఒకమ్మాయి వచ్చింది. లలితమ్మగారికి విషయం అర్థం అయినా ''రవీ! ఈ అమ్మాయి'' అని ఆగిపోయారు. దానికి రవి ''అమ్మా! ఈ అమ్మాయి సుజాత. నాకు బస్ స్టాప్‌లో పరిచయం అయింది. చాలా మంచి అమ్మాయమ్మా!'' అన్నాడు. ఆ మాటలతో ఆవిడకు కొడుకు మనసు బాగా అర్థం అయ్యింది. వంటింట్లోకి వెళ్తూ ''అమ్మాయి సుజాతా! ఇలా రామ్మా, కాఫీ పెడదాం'' అన్నారు. ఆ అమ్మాయి భయపడుతూ వెనక్కి తిరిగి రవిని చూస్తూ లోపలకు వచ్చింది.

''ఏమ్మా! ఎక్కడుంటారు మీరు?'' ప్రశ్నించారు లలితమ్మగారు.

''ప్రక్క వీధిలోనే వుంటామండి'' అంది సుజాత.

''ఇంట్లో ఎవరెవరు వుంటారు?''

''అమ్మ నాన్నగారు, అన్నయ్య, నేను వుంటామండి''

''మీ అమ్మ, నాన్నగారు మా ఇంటికి వస్తారా? లేక నేను మీ ఇంటికి రావాలా?'' అన్నారావిడ.

తెల్లబోయిన సుజాత ''దేనికండి?'' అంది.

''పెళ్ళి మాటలు మాట్లాడడానికి'' అన్న సమాధానం విని సిగ్గుతో బయటకు పరుగు తీసింది సుజాత.

మూడు నెలలు తిరగకుండానే సుజాత ఆ ఇంటికి కోడలై వచ్చింది. చాలా అణుకువ అయిన అమ్మాయి. పనంతా తనే చేస్తానని పట్టుబట్టేది.

''నువ్వు ఆఫీసుకు వెళ్ళావు. నేను ఇంట్లోనే వుంటాను. పనిమనిషి వుంది కదా! నేను చేసేది వంట ఒక్కటే! అయినా నా ఒంట్లో ఓపిక వున్నన్నాళ్ళూ చేస్తాను'' అన్నారు లలితమ్మగారు.

ఐదు సంవత్సరాలు తిరిగేప్పటికి ఇల్లు, ఇద్దరు మనుమలు శ్రీకాంత్, శిరీషలతో కళకళలాడింది. భర్త పోయినప్పటికే లలిత కాస్తా లలితమ్మగారు అయ్యింది. కొడుకు పెళ్ళయ్యాక తను అమ్మగారు, కోడలు చిన్నమ్మగారు. ఇప్పుడు కోడలు అమ్మగారు, తను పెద్దమ్మగారు. కాలంలో ఇలాంటి మార్పులు రాక తప్పవు. దానికి ఆవిడ ఎప్పుడూ బాధపడలేదు. పైగా సంతోషించేది కూడా! ఆవిడకు ఇలాంటి విషయాల గురించి ఆలోచించడానికి ఖాళీ సమయం కూడా ఎక్కువగా ఉండేది కాదు. మనుమలు స్కూలుకి వెళ్ళే వయసుకి వచ్చారు. ప్రొద్దున్నే ఆదరాబాదరగా వంటచేసి, నాలుగు బాక్సులు కట్టి, అందరూ వెళ్ళాక మిగిలిన పనులు చేసుకొనేసరికి భోజనం టైమ్ అయ్యేది. కొంచెం విశ్రాంతి తీసుకుని, స్కూలునించి వచ్చే పిల్లల కోసం టిఫిన్ చేసిపెట్టి, రాత్రి భోజనాలకు అన్ని సిద్ధం చేసేది. రాత్రి సుజాతే వండుతుంది. కానీ తనకి లేటు అవుతుందని, అన్నీ సిద్ధం చేసి వుంచేవారు. పిల్లలు ఇంకా చిన్నవాళ్ళు గాబట్టి, వాళ్ళ హోమ్‌వర్క్ కూడా ఆవిడే చేయించేవారు. తన రవి చిన్ననాటి రోజులు మరీ మరీ గుర్తుకు వచ్చేవి.

పిల్లలు పెద్దవాళ్ళయ్యే కొద్దీ, ఇల్లు ఇరుకుగా వున్నట్లు అనిపించేది. స్కూలుకి దగ్గరగా 2 బెడ్ రూమ్ అపార్ట్‌మెంట్‌కి మారారు. అక్కడకు మారిన తర్వాత ఆవిడకి కొత్త జీవితం ప్రారంభం అయ్యింది. వంట ఇల్లు వీలుగా వుండడంవల్ల పని చాలా సులువు అయినట్లు వుండేది ఆవిడకు. ఆ అపార్ట్‌మెంట్‌లో తన వయస్సు వాళ్ళు చాలామంది పరిచయం అయ్యారు. మధ్యాహ్న భోజనాలు అయ్యాక ఎవరో ఒకరి ఇంట్లో కలుసుకునేవారు. తమ గడిచిన జీవితం గురించి, పిల్లల గురించి చెప్పుకునే వారు.

ఎవరైనా ఎప్పుడైనా ''మీ కోడలు ఏమీ చెయ్యదా? పనంతా మీరే చేస్తున్నారు'' అంటే ఆవిడకు చాలా కోపం వచ్చేది. ''ప్రొద్దున్న టైమ్ ఎక్కడ? ఆఫీసుకి వెళ్తుంది కదా! నన్ను పరాయిదాన్ని చేస్తున్నారని, నేను అనుకోవచ్చు, నాకు ఇలాగే బాగుంది'' అనేవారు.

ఇలా లలితమ్మగారి జీవితం సాఫీగా సాగిపోతుంది. ఆవిడ ఇంట్లో చాలా మార్పులు వచ్చాయి. కొడుకు ఉద్యోగం మాని, స్వంతంగా వ్యాపారం ప్రారంభించాడు. రాత్రనకా, పగలనకా, అహర్నిశలూ శ్రమించడంవల్ల అనతికాలంలోనే వ్యాపారంలో నిలదొక్కుకున్నాడు. ఇంక కోడలు కూడా తను చేస్తున్న ఆఫీసులో బ్రాంచ్ మేనేజర్ అయ్యింది. మనుమలకు కాలేజీకి వెళ్ళే వయసు వచ్చింది. వాళ్ళకిప్పుడు సాయం చేయలేకపోతుంది. కాలేజీ నుంచి రాగానే మళ్ళీ ట్యూషన్లకి వెళ్ళిపోతారు. ఇద్దరూ వేరు వేరు గదులు కావాలని గొడవ చెయ్యడం మొదలు పెట్టారు. ఇద్దరి స్నేహితులూ ఒకేసారి వస్తే ఎక్కడ కూర్చోబెట్టి మాట్లాడాలి అని అడుగుతున్నారు.

ఆ సమయంలో ఒకరోజు రవి ఆఫీస్‌నుంచి త్వరగా వచ్చాడు. లలితమ్మగారు కంగారు పడ్డారు. ''ఏంటిరా! ఒంట్లో బాగోలేదా?'' అని అడిగారు.

''నువ్వొకసారి తయారై రామ్మా! బయటకు వెళ్దాం'' అన్నాడు. ఆవిడకు చాలా భయం వేసింది. ''సుజాత ఏదిరా? నన్ను ఎక్కడకు తీసుకువెళ్తున్నావు?'' అన్నారు.

''కంగారు పడకమ్మా! సుజాత ఆఫీసులోనే వుంది. నువ్వు త్వరగారా! నీకు ఒకటి చూపించాలి'' అన్న రవి మాటలతో ఆవిడ స్థిమితపడి, త్వరగా తయారై వచ్చి కారు ఎక్కారు. ఊరికి కొంచెం దూరంగా తీసుకుని వెళ్ళి కారు ఆపాడు రవి. అక్కడక్కడ విసిరేసినట్లుగా వున్నాయి ఇళ్ళు. కారు దిగిన తల్లితో ''ఇక్కడ ఫ్లాటు తీసుకున్నానమ్మా! ఎలా వుంది?'' అని అడిగాడు రవి.

''బాగుందిరా!'' అన్నారు లలితమ్మ గారు.

''ఇప్పుడున్న ఫ్లాట్ చిన్నదిగా అనిపిస్తుంది. పిల్లలు కూడా పెద్దవాళ్ళు అవుతున్నారు. నువ్వు కూడా పూజగది వేరే వుంటే బాగుండునని ఎప్పుడూ అంటుంటావు కదమ్మా! మనం కట్టుకుంటే మనకి నచ్చినట్టు ప్లాను వేసుకొని కట్టుకోవచ్చుని తీసుకున్నానమ్మా!'' అన్నాడు రవి. లలితమ్మగారి మనసంతా గర్వంతో నిండిపోయింది. తన కొడుకు, తను కని, పెంచి, కష్టపడి, చదివించి పెద్దచేసిన కొడుకు, ఎంత ప్రయోజకుడు అయ్యాడు అనిపించింది. ఇల్లు కడుతున్నప్పుడు, ఎప్పుడూ తన సలహా తీసుకుని మధ్య మధ్యలో తనని తీసుకుని వచ్చి చూపించేవాడు. ఈ ఇల్లు పూర్తి అయి ఇక్కడకు వచ్చి, అప్పుడే సంవత్సరం అయిపోయింది. తను ఇంత పెద్ద ఇంట్లో ఒంటరిగా మిగిలింది. వేరు వేరు గదులు కావాలని పేచీ పెట్టిన మనుమలు ఇద్దరూ పెద్ద చదువులకి వేరే వేరే ఊళ్ళలో హాస్టల్స్‌లో వున్నారు. 'ఇక్కడ సీటు దొరకదేంటిరా! నువ్వు ప్రయత్నం చెయ్యలేదు' అని తను రవితో అంటే ''హాస్టల్‌లో వుంటేనే మంచిదమ్మా! చదువు మీదే దృష్టి పెడతారు. ఇక్కడ వుంటే టి.వి.చూడ్డం, సినిమాలు, స్నేహితులు.. చదువు మీద అంత శ్రద్ధ వుండదమ్మా!'' అన్నాడు.


ఇంతలో పనిమనిషి రత్న వచ్చింది. ''పెద్దమ్మగారూ! రండి భోజనం వడ్డించాను'' అంది.

''ఇంకా ఆకలి లేదే!'' అన్నారు.

''తినెయ్యండమ్మా! మీరు తిన్నాక నేను కూడా తిని డ్రైవర్ భార్యతో కలిసి చిరంజీవి సినిమాకి వెళ్ళాలమ్మా'' అంది రత్న.

'దీని పనే బాగుంది. ఊరికి దూరమైనా, స్నేహితులకి కొదువలేదు' అనుకున్నారు ఆవిడ. అన్యమనస్కంగానే భోజనం చేసి, గదిలోకి వచ్చారు. చేద్దామన్నా ఏ పని లేదు. వంట మనిషి, పని మనిషి, డ్రైవరు, తోటమాలి అందరూ వున్నారు. ముందు నుంచి పని బాగా చెయ్యడం అలవాటు వుండడం వలన తనకు తనే మూల పడవేసిన పాత సరుకులాగ వున్నానని అనిపిస్తూంది. ఆ మాటే రవితో అంటే ''ఇన్నాళ్ళూ చాలా కష్టపడ్డావమ్మా! ఇంక సుఖపడు'' అన్నాడు.

తను ఈ ఒంటరితనం భరించలేకపోతుంది. ఇంతకు ముందులా పుస్తకాలు కూడా చదవలేకపోతుంది. కొంచెంసేపటికే కళ్ళు మండుతున్నాయి. ఒక విషయం ఆవిడకు ఈమధ్య తట్టింది. తను



'వృద్ధాశ్రమం'లో చేరితే ఎలా వుంటుంది అని. చాలాసార్లు టి.వి.లో చూసింది. కొన్ని బాగా నడపక పోయినా మంచి వాటిల్లో తనలాంటి వాళ్ళకి చాలా సౌకర్యంగా వుంటుంది. అంటే ఇక్కడ లేదని కాదు. కాని, అక్కడ తన వయసు వాళ్ళందరూ వుంటారు. 'ఈరోజు ఎల్లాగైనా రవితో చెప్పాలి' అనుకున్నారు.

ఆఫీసునుంచి రాగానే తల్లి అన్యమనస్కంగా వుండడం గమనించిన రవి, ''ఏమ్మా! అలా వున్నావు. ఒంట్లో బాగోలేదా?'' అని అడిగాడు.

''ఏం లేదురా! బాగానే వున్నాను'' అన్నారావిడ.

''ఒంట్లో కొంచెం తేడాగా వున్నా చెప్పమ్మా! దాయకు'' అన్నాడు.

తల్లి తనకోసం పడిన కష్టం రవి ఒక్క క్షణం కూడా మర్చిపోడు.

కొడుకు తన గురించి ఆలోచిస్తున్నాడని ఆవిడకు తెలుసు. తను వృద్ధాశ్రమంలో చేరతానంటే చాలా బాధపడతాడని కూడా తెలుసు. అయినా ఆవిడ భోజనాలు అయ్యాక కొడుకు గదిలోకి వెళ్ళారు. కోడలు వంటింట్లో రేపటి వంటకి కావలసిన పదార్థాల గురించి, చెయ్యవలసిన వంట గురించి, వంటవాడితో మాట్లాడుతోంది. తల్లిని చూడగానే ఆవిడ ఏదో ముఖ్యమైన విషయం మాట్లాడతారని అర్థం అయ్యింది. ఎప్పుడూ తనే ఆవిడ గదిలోకి వెళ్ళి కూర్చుంటాడు గాని, ఆవిడ ఎప్పుడూ రాలేదు. ''రామ్మా! కూర్చో!'' అని ''ఏంటమ్మా! సాయంత్రం నుంచి చూస్తున్నాను. అదోలా వున్నావు. ఏమయ్యిందమ్మా'' అన్నాడు.

''నాకు ఏమీ తోచడం లేదురా'' అంది ఉపోద్ఘాతంలా.

''డివిడి ఉంది కదమ్మా! నీకు ఇష్టమైన సిని

మాలన్నీ కొన్నాను. చూడడం లేదా? ఎలా పెట్టుకోవాలో మళ్ళీ చూపించమంటావా?'' ఆత్రంగా అడిగాడు రవి.

''ఒక్కదాన్నే కూర్చుని ఏం చూడనురా?'' అని ''నువ్వు ఏమీ అనుకోనంటే ఒక మాట చెప్తాను'' అన్నారు.


''చెప్పమ్మా'' అన్నాడు రవి.

''ఏం లేదురా! ఈ రోజుల్లో చాలామంది వృద్ధాశ్రమంలో చేరుతున్నారు కదా! నేను కూడా..'' అని ఆగిపోయారు. కొడుకు ముఖంలో ఆశ్చర్యం, బాధ ఒకేసారి కనిపించాయి.

''అమ్మా'' నివ్వెరపోతూ అన్నాడు.

## తల్లి పాత్రలో మీనా

**తెలుగులో ఎప్పుడో కనుమరుగైన మీనా ప్రస్తుతం మలయాళ చిత్రాల్లో, తమిళ టీవీ సీరియల్స్‌లో నటిస్తూ బిజీగా వుంది. ఇటీవలే ఆమె ఓ మలయాళ చిత్రంలో యువతార గోపికకి తల్లిగా నటించింది. అప్పుడే తల్లి పాత్రలా అని ఆశ్చర్యపోయిన వాళ్లకి జవాబిస్తూ- 'పాత్ర చాలెంజింగ్‌గా వున్నప్పుడు అది ఏ పాత్రయితే ఏంటి? తల్లి పాత్ర చేసిన తప్పులేదు' అని తనని తాను సమర్థించుకుంది. అంతే మరి కాలంతో వచ్చే మార్పు మనం అంగీకరించాలి కదా!**



కొడుకు మనసు చాలా గాయపడిందని గ్రహించారు లలితమ్మగారు. ''నువ్వు బాధపడకురా బాబూ! నీకు ఇష్టం అయితేనే.. అక్కడైతే నా వయసు వాళ్ళు అందరూ వుంటారని అలా అన్నాను అంతే! నువ్వు ఎక్కువగా ఈ విషయం గురించి ఆలోచించకు'' అని బయటకు వచ్చేశారు. కొడుకు విషణ్ణవదనం ఆవిడ చూడలేకపోయారు. కొడుకు ఇంక రాత్రంతా నిద్రపోడని ఆవిడకు తెలుసు. అనవసరంగా యీ విషయం ఎత్తానేమోనని చాలా మధన పడ్డారు. కానీ తన సమస్య కొడుకుతో కాకపోతే ఇంకెవరితో చెప్పుకోను? అనుకుని స్థిమిత పడ్డారు.

ఇంక రవి పరిస్థితి అయోమయంగా వుంది. పని చెయ్యాలని అన్పించలేదు. కంప్యూటర్ కట్టేసి బాల్కనీలోకి వచ్చి నిలబడ్డాడు. తను చిన్నప్పట్నుంచీ ఒకే ఆశయంతో పెరిగాడు. తను డబ్బు సంపాదించటం మొదలుపెట్టాక, తల్లికి అన్ని సుఖాలు అందించాలని అలాగే చేశాడు కూడా. కానీ అన్ని సౌకర్యాలు వున్నా ఆవిడ ఒంటరితనంతో బాధపడుతున్నారు. తను అపార్టుమెంటునుంచి వచ్చి, పొరపాటు చేశాడా అని మొదటిసారిగా అనిపించింది. ఔను నిజమే! అమ్మకు తను అన్నీ ఇచ్చాడు. వాటితోపాటు ఒంటరితనం కూడా! ఈ విషయం తను ఎందుకు గమనించలేకపోయాడు? పెద్దవాళ్ళకి, ముఖ్యంగా స్నేహితుల అవసరం వుంటుందని తనకి ఎందుకు తట్టలేదు. తను ఎప్పుడూ తల్లిమాట కాదనలేదు. కానీ అమ్మ ఈ కోరిక తను తీర్చగలడా? తల్లిలేని ఇంట్లో తను మాత్రం ఉండగలడా? అలాగని ఆవిడ బాధపడుతుంటే చూస్తూ ఊరుకోగలడా? ఆలోచనలతో గదిలోకి వచ్చి, మంచం మీద కూర్చున్నాడు.

వంటింట్లోంచి బెడురూంకి వచ్చిన సుజాతకు ఆశ్చర్యంగా అనిపించింది. అర్ధరాత్రి వరకూ కంప్యూటర్ ముందునుంచి లేవని రవి, ఈ రోజు అప్పుడే దాన్ని కట్టెయ్యడం చిత్రంగా అనిపించింది. ''ఏంటండీ! ఈ రోజు విశేషం? నాకోసం ఎదురుచూస్తున్నారా?'' సరదాగా అంటూ దగ్గరకు వచ్చిన సుజాత, భర్త ముఖం చూసి కాళ్లకు ఏదో అడ్డుపడినట్టు ఆగిపోయింది.

''ఏమైందండీ? పిల్లల దగ్గర నుంచి మెయిల్ ఏదైనా వచ్చిందా? అయినా నేనిప్పుడే ఇద్దరితోనూ మాట్లాడి వస్తున్నాను'' పాలిపోయిన ముఖంతో అంది. రాత్రి తన పర్సనల్ మెయిల్ చూసుకుని, జవాబులు పంపిస్తుంటాడు రవి. అందుకే సుజాత తల్లి మనసు ముందుగా పిల్లలవైపు వెళ్ళింది.

''కాదు సుజాతా! ఇలా కూర్చో!'' అన్నాడు.

భర్తను ఎప్పుడూ ఇలా చూడని సుజాతకు సన్నగా వణుకు మొదలయ్యింది. భార్య చేతిని తన చేతిలోకి తీసుకుంటూ ''అమ్మ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో చేరతానని అంటోంది'' అలా అంటుంటేనే కళ్ళల్లో నీళ్ళు వూరాయి రవికి.

''అదేంటి'' ఒక్క నిమిషం ఏమీ అర్థం కాలేదు సుజాతకు.

''అమ్మ నన్ను వదిలి బయటకు వెళ్తానందంటే ఎంత ఒంటరితనం అనుభవిస్తూందో ఆలోచించు. అయినా అమ్మ లేకుండా నేను వుండలేను. అలాగని ఆవిడ బాధపడుతుంటే చూస్తూ వూరుకోలేను'' అన్నాడు.

ఆ సంగతి సుజాతకు వేరుగా చెప్పనవసరం లేదు. అత్తగారికి భర్తకు మధ్య వున్న అనుబంధం తనుకు బాగా తెలుసు. అందుకే ఇన్నేళ్ళ వైవాహిక జీవితంలో ఎప్పుడూ సరదాకి కూడా ''మీకు ఎవరంటే ఎక్కువ ఇష్టం-నేనా మీ అమ్మగారా?'' అని పొరపాటున కూడా అడగలేదు. ఎందుకంటే సమాధానం ''అమ్మ'' అని వస్తుందని తెలుసు. అంత మాత్రాన తనంటే ప్రేమ లేదని కాదు. వాళ్ళిద్దరూ జీవితంలో ఒడుదుడుకులు కలిసి పంచుకున్నారు. ఇప్పుడు భర్త ఎంత బాధలో వున్నాడో సుజాత అర్థం చేసుకోగలదు. అయినా ఇప్పుడు తను చెయ్యవలసింది, భర్తకు ధైర్యం చెప్పడం. అందుకే ''ఇప్పుడు పడుకోండి. రేపు ఆలోచిద్దాం. అయినా శతకోటి సమస్యలకు అనంతకోటి ఉపాయాలు' ఉంటాయని సామెత వుంది కదా! దీనికి కూడా ఏదైనా ఉపాయం దొరుకుతుంది'' అంది. మళ్ళీ తనే ''నన్ను ఉద్యోగం మానెయ్యమంటారా?'' అని అడిగింది.

ఆ ఆలోచన రవికి కూడా వచ్చింది. కాని, సుజాత మాత్రం ఎంతసేపు తన తల్లికి కంపెనీ ఇవ్వగలదు? ఎక్కువగా ఇద్దరూ కలిసి వున్నా మనస్పర్థలు రావచ్చు. అదే మాట బయటకు అన్నాడు. ఆ మాట కూడా నిజమే అనిపించింది సుజాతకు. భర్తకు ధైర్యం

చెప్పినా, పడుకున్న సుజాతకు కూడా నిద్ర పట్టలేదు. తన తల్లి గుర్తుకు వచ్చింది. 'అమ్మ కూడా ఇలాగే బాధ పడ్తుందా?' మొదటిసారిగా ఆ దిశగా ఆలోచించడం మొదలుపెట్టింది.

ఈ ఇల్లు గృహ ప్రవేశానికి వచ్చినప్పుడు ఆవిడ రెండు నెలల పైగానే ఇక్కడ వుండిపోయారు. 'ఇంక వెళ్తాను' అని కూడా అనలేదు. తనని వదిలి పెట్టలేక అనుకుంది. బహుశా ఆవిడ కూడా అత్తగారిలాగే ఒంటరితనంతో బాధపడుతుందేమో!

ఇక్కడ అత్తగారితో కలిసి వుండడం ఆవిడకూ బాగుండి వుంటుంది. అత్తయ్యగారు, అమ్మ ఇద్దరూ కూడా సంతోషంగా వుండేవారు. కలిసి తోటలో తిరిగేవారు. టీవీ చూస్తూ కామెంట్స్ చేసేవారు. పేపరు చదివి రాజకీయాలు చర్చించుకునేవారు. ఇవన్నీ గుర్తుకు వచ్చాయి సుజాతకు.

ఈ విషయం ముందుగా ఎందుకు తట్టలేదని సుజాత మనసు చాలా తల్లడిల్లింది. 'మనం ఏమనుకుంటాము? వాళ్లకి అన్ని విషయాలూ ఎందుకు? ఒక మూల కూర్చొని టీవీ చూసి తర్వాత కృష్ణా, రామా అనుకోవచ్చు కదా! అనుకుంటాం. కాని మనకి కూడా ఆ వయసు వస్తుంది కదా! అప్పుడు మనం అలా వుండగలమా? ఈ చిన్ని విషయం మనం ఎందుకు మర్చిపోతాం? వాళ్లకి కూడా స్నేహితులు కావాలని, ఎవరితోనైనా తమ భావాలు పంచుకోవాలని అనుకుంటారు కదా!' ఈ దిశగా ఆలోచించడం మొదలుపెట్టాక సుజాత మనసులో ఒక ఆలోచన రూపుదిద్దుకుంది. టైమ్ చూస్తే అప్పుడే 4.30 అయిపోయింది. భర్త కూడా నిద్రపోయి వుండడని తెలుసు. లైట్ వెయ్యగానే రవి లేచి కూర్చున్నాడు.

''ఇహ మీకు నిద్ర పట్టదు. ముఖం కడుక్కోండి. కాఫీ తీసుకుని వస్తాను'' అంది సుజాత.

రవి చాలాసార్లు అర్ధరాత్రి దాటినా పని చేసుకుంటుంటాడు. మధ్యలో ఎప్పుడైనా టీ పెట్టాల్సి వస్తుంది. ప్రతీసారి క్రిందికి వెళ్లడం కుదరదని ప్రక్కనే చిన్న రూమ్‌లో కాఫీ, టీ పెట్టుకోవడానికి ఏర్పాటు చేసుకున్నారు. రవి బాత్‌రూమ్‌నుంచి వచ్చేటప్పటికి, రెండు కప్పులు కాఫీ కలిపి వుంచింది. రవి మౌనంగా కాఫీ త్రాగటం మొదలుపెట్టాడు. ''నాకు ఒక ఐడియా వచ్చింది'' అంది సుజాత.

''ఏంటి చెప్పు'' అన్నాడు.

''నేను ఇంతకు ముందు ఆలోచించలేదు కానీ అమ్మ కూడా ఇలాగే బాధపడ్తూ వుండవచ్చు. అమ్మను వచ్చి ఇక్కడ ఒక రెండు నెలలు వుండమందాం. అలాగే అత్తయ్యగారు కూడా అన్నయ్య ఇంటికి వెళ్ళవచ్చు. వాళ్ళకీ కొంత మార్పు వుంటుంది. ఏమంటారు?'' అంది సుజాత.

రవి మనస్సులో ముందురోజు రాత్రి నుంచి వున్న బాధ అంతా ఒక్కసారి తీసివేసినట్టు అయ్యింది. ''బ్రిలియంట్ ఐడియా..కాని అమ్మ కూడా వెళ్ళాలా?'' అన్నాడు. దానికి నవ్వుతూ సుజాత ''ఎప్పుడూ మా అమ్మనే రమ్మనడం బాగోదు కదా!'' అంది.

నిజమే అనుకున్నాడు రవి. సుజాత మళ్ళీ మొదలుపెట్టింది. ''నేను ఈ విషయం రాత్రంతా ఆలోచించాను. ఈ సమస్య మన ఒక్క ఇంట్లోనే కాదు. దాదాపు అందరి ఇళ్ళల్లో వుంది. మనకి తెలిసిన వాళ్ళనే తీసుకోండి. ఈ వూళ్లోనే ఆరేడు ఇళ్ళల్లో అత్తయ్యగారిలాంటి వాళ్ళు వున్నారు. మా పెద్దమ్మ వుంది చూడండి. పిల్లలు అమెరికాలో సెటిల్ అయ్యారు. ఆవిడ ఒంటరిగా వుంటారు. ఆవిడను కూడా రమ్మంటే రావచ్చు. తర్వాత నెమ్మదిగా అందరి లిస్ట్ తయారు చేసి, వాళ్ళ ఇంట్లో వాళ్లతో మాట్లాడి, ఒక పద్ధతి ప్రకారం వీళ్ళందరూ ఎప్పుడూ ఒంటరిగా వుండకుండా, ఒకరి ఇంటికి ఒకరు వెళ్తుండేలా చెయ్యగలిగితే బాగుంటుంది కదా'' అంది.

దానికి రవి ''అది నిజమే కాని దానికి చాలా టైమ్ పడుతుంది. ఇక్కడ ఇంకో విషయం కూడా గుర్తుపెట్టుకోవాలి. ఎప్పుడూ ఒక ఇంట్లో ఇద్దరి కన్నా ఎక్కువమంది వుండకూడదు. ఇంట్లో వాళ్ళకి చెయ్యడం కూడా కష్టమే కదా! అందులోనూ పెద్ద వయసు వాళ్ళకు'' అన్నాడు.

''సరే ఆ విషయాలన్నీ తర్వాత ఆలోచిద్దాం. ముందు అన్నయ్యకు ఫోన్ చేస్తాను'' అంది సుజాత.

ప్రొద్దున్నే చెల్లి దగ్గర నుంచి ఫోన్ రావడంతో సుకుమార్ కంగారు పడ్డాడు.

''ఏమ్మా! సుజాతా! అంతా బాగున్నారా?'' అని అడిగాడు.

''అంతా బాగానే వున్నారు అన్నయ్యా'' అంటూ సంగతంతా వివరించింది సుజాత.

''అలాగే అమ్మని తప్పకుండా పంపిస్తాను. కాని మీరు ఇల్లు కట్టుకొని వెళ్లిన తర్వాత బొత్తిగా ఇటు వైపు రావడం మానేశారు. ఎల్లుండి ఆదివారం పొద్దున్నే వచ్చెయ్యండి. లంచ్ ఇక్కడే చేసి సాయంత్రం వెళ్ళేప్పుడు అమ్మని తీసుకుని వెళ్దురు గాని'' అన్నాడు.

''అలాగే అన్నయ్యా'' అంటూ ఫోన్ పెట్టింది సుజాత.

రవి మనసు తేలికైంది. తల్లి అప్పటికే పూజ కూడా చేసుకొని లాన్‌లో కూర్చుంటుందని తెలుసు.

''అమ్మకు కూడా కాఫీ కలుపు'' అని మళ్ళీ తనే, ''వద్దులే నేనే కలుపుతాను'' అన్నాడు.

రెండు కప్పులు కాఫీ కలిపి, ఫ్లాస్క్‌లో వేసి క్రిందికి వెళ్తుంటే మళ్ళీ చిన్ననాటి రోజులు గుర్తుకు వచ్చాయి. తన తల్లికి కాఫీ అంటే ఎంతో ఇష్టం. కానీ తండ్రి పోయిన తర్వాత కాఫీ తాగితే పాలు ఎక్కువ ఖర్చు అవుతాయని టీ మాత్రమే తాగేది. ఒక్క ఆదివారం ప్రొద్దున్న మాత్రం రెండు చిన్న గ్లాసులతో కాఫీ పెట్టేది. ఇప్పుడు చిక్కటి పాలు వున్నాయి. ఖరీదైన ఇన్‌స్టెంట్ కాఫీ వుంది. అయినా ఆ రోజుల్లో తల్లి కలిపిన నీళ్ళ పాల కాఫీ వున్నంత రుచిగా ఈ కాఫీ వున్నట్లు అనిపించదు రవికి.

దానికి ఆవిడ ''లేదురా! కాఫీ నిజానికి ఇప్పుడే రుచిగా వుంది. అప్పుడు అది మనకి అందుబాటులో లేని రుచి అందుకే వారానికి ఒక్కసారి త్రాగినప్పుడు ఎంతో రుచిగా అనిపించేది. ఇప్పుడు రోజూ తాగుతున్నాం కదా! అయినా ఎప్పుడో జరిగిపోయిన రోజులు ఎంత మధురంగా అన్పిస్తాయి. కొన్ని సంవత్సరాలు జరిగిపోయాక, ఈ రోజులు ఎంతో బాగున్నట్లు అన్పిస్తాయి చూడు. ఏదైనా మనకి దూరం అవుతుందేమో అనుకున్నప్పుడే దాని విలువ తెలుస్తుంది'' అన్నారు.

''నిజమేనమ్మా! నువ్వు చెప్పిన మాటలన్నీ నిజం. నువ్వెప్పుడూ నాతోనే వుంటావని అనుకున్నాను. ఇప్పుడు నువ్వు వెళ్తానని అంటేనే. నువ్వు నాకు ఎంత ముఖ్యమో అర్థం అయ్యింది. నువ్వు లేకుండా నేను వుండలేనమ్మా'' చిన్నపిల్లాడిలా అన్నాడు రవి.

కొడుకు రాత్రంతా నిద్రపోలేదని ఆవిడ రవి రాగానే గమనించారు. కొడుకు మనసు చాలా బాధ పెట్టానని, ఆవిడ తల్లి మనసు తల్లడిల్లింది. ''రాత్రంతా నిద్రపోలేదురా? పిల్లలు కూడా ఇంట్లో లేరు కదరా! అందుకే అప్పుడప్పుడు అలా అన్పిస్తుంది. ఇంకెప్పుడూ ఆ మాట ఎత్తను'' అన్నారు.

''లేదమ్మా! నువ్వు నీ బాధ పైకి చెప్పడంవల్లే, నా పొరపాటు తెలిసింది'' అంటూ సుజాతకు వచ్చిన ఆలోచన గురించి వివరించి చెప్పాడు. ''ఇంకెవరన్నా వుంటే వెళ్తానని అనవు కదమ్మా!'' అన్నాడు. దానికి ఆవిడ సజలమైన నయనాలతో కొడుకు చెయ్యి పట్టుకొని ''నిన్ను కన్నందుకు నేనెంతో గర్వపడుతున్నానురా! అలాగే సుజాత నా కోడలు అయినందుకు కూడా! మీరిద్దరూ నా మాటలకి విలువ ఇచ్చి, దాని గురించి ఆలోచించారు. 'ఏదోలే ముసల్ది ఎలాగో వుంటాది' అనుకోకుండా దానికొక పరిష్కారం ఆలోచించారు. ఈ వయసులో నాలాంటి వాళ్ళకి ఇంతకన్నా ఏం కావాలిరా?'' అన్నారు.

మేడమీద నుంచి తల్లీ, కొడుకులను చూస్తున్న సుజాతకు కూడా కళ్ళు చెమర్చాయి. అంతలోనే ఆ కళ్లలో తన కొడుకుని తల్చుకుని ఒక మెరుపు వచ్చింది. తనకి ఆ వయసు వచ్చినప్పుడు, తన కొడుకు కూడా అంత ప్రేమతో తనని ఆదరిస్తాడని, ఆదరించాలని సుజాత కోరుకోవడం అత్యాశ కాదు కదా!